ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
బుధవారం 10 జూలై 2024

కురుకుల్లా క్రమంలో భద్రకాళి

నాలుగో రోజుకు శాకంబరీ ఉత్సవాలు




కురుకుల్లా, బేరుండా క్రమంలో భద్రకాళి అమ్మవారు

వరంగల్ కల్చరల్, జూలై 9: వరంగల్‌లోని భద్రకాళి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. వేడుకలు మంగళవారంనకు నాలుగో రోజుకు చేరాయి. నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన నీరాజన మంత్రపుష్పాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దశ మహా విద్యలోని కాళీ క్రమాన్ని అను సరించి శోడషి క్రమాన్ని, సాయంత్రం పూజలు నిర్వహించారు. భద్రకాళి అమ్మవా రిని కురుల్లా, బేరుండా అలంకరించారు. ఉత్సవాల సందర్భంగా భారీసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టారు.



ఎక్సైజ్ బదిలీల్లో.. పైరవీల పెత్తనం!

- పారదర్శకత లోపిస్తోందంటున్న ఉద్యోగులు
- కొందరు ఏళ్ల తరబడి పట్టణాల్లోనే తిష్ట
- పైరవీలతో ఇతరులు రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు
- ఆందోళనలో గ్రామీణ ప్రాంతాల కానిస్టేబుళ్లు
- ఈ సారైనా అర్బన్ పరిధిలోకి వచ్చే అవకాశాలపై సందేహాలు



హనుమకొండ, జులై 9 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ శాఖలో ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో పైరవీదారుల పెత్తనమే నడుస్తోందని, దీంతో ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తమకు పట్టణ కేంద్రాల్లో పని చేసే భాగ్యం దక్కుతుందా? లేదా అన్న సందేహాన్ని గ్రామీణ ప్రాంతాల్లో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న ఆ శాఖ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు వ్యక్తం చేస్తున్నారు. బదిలీల ప్రక్రియ ప్రారంభం కాగానే గతంలో లాగానే కొందరు ఉద్యోగులు.. పై అధికారులను మచ్చిక చేసుకొని మళ్లీ జిల్లా కేంద్రంలో, పట్టణ ప్రాంతాల్లో కొనసాగాలనే ప్రయత్నాలను ప్రారంభించినట్టు తెలుస్తోంది. దీంతో పుష్కరకాలంగా గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న తాము మళ్లీ అన్యాయానికి గురయ్యే పరిస్థితి కనిపిస్తోందని కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు ఆవేదన చెందుతున్నారు. తమకు సీనియారిటీని బట్టి పట్టణ ప్రాంత పరిధిలో పని చేసే అవకాశం ఈ సారి కూడా రాకపోతే ఇక తమ సర్వీస్ అంతా గ్రామీణ ప్రాంతాల్లోనే గడిచిపోతుందని, రిటైర్మెంట్ కూడా అక్కడే కాకతప్పని పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు.

గతంలో రెండు సార్లు

ఎక్సైజ్ శాఖలో బదిలీలు, పదోన్నతుల్లో పారదర్శకత లోపిస్తోందని ఇందుకు గతంలో రెండు సార్లు జరిగిన బదిలీల ప్రక్రియలో జరిగిన అక్రమాలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని బాధిత కానిస్టేబుళ్లు పేర్కొంటున్నారు. బదిలీల ప్రక్రియ జరిగిన ప్రతి సారి అధికారుల వద్ద పలుకుబడి ఉన్న కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు పట్టణ పరిధిలోనే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ అవుతున్నారు కానీ, నిబంధనల ప్రకారం వారిని గ్రామీణ ప్రాంతాలకు పంపడం లేదన్న ఆరోపణలున్నాయి. కొందరు కానిస్టేబుళ్లు 20 ఏళ్లుగా పట్టణ పరిధిలోనే ఎక్సైజ్ స్టేషన్లలోనే కొనసాగుతున్నారని, ఇలా సుమారు 20 నుంచి 25 మంది కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు నగర, పట్టణ ప్రాంతాల్లోని స్టేషన్లలోనే పోస్టింగులు పొందుతున్నారని.. ఉన్నతాధికారులను మచ్చిక చేసుకొని, పైరవీలతో బయటి నుంచి వేరేవారిని రానివ్వడం లేదన్న విమర్శలున్నాయి. ఎక్సయిజ్ శాఖలో 2012, 2018 సంవత్సరాల్లో బదిలీలు జరిగాయి. 2018 సంవత్సరంలో బదిలీలు జరిగినప్పుడు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. ఏ ప్రాంతాలకు తమను బదిలీ చేయాలో ఆప్షన్లు కూడా ఆ దరఖాస్తుల్లో పేర్కొన్నారు. అయితే దరఖాస్తు చేసుకున్నవారికి బదిలీలకు సంబంధించి ఓటీపీ వస్తుందని చెప్పినా అలాంటిదేమీ జరగలేదు. సిటీలో పని చేస్తున్న వారు పైరవీలు చేసుకొని అక్కడే తిష్టవేయడంతో దూర ప్రాంతాల వారు మళ్లీ అక్కడే కొనసాగాల్సి వచ్చింది.

ఈ సారైనా స్థానం మారుతుందా?

ఎక్సైజ్ శాఖలో బదిలీలు జరిగేదే అంతంత మాత్రం. ఆ జరిగినప్పుడన్నా దీర్ఘకాలం గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని నగర ప్రాంతాలకు బదిలీ చేయకుండా గ్రామీణ ప్రాంతాల్లోనే ఒక చోటి నుంచి మరో చోటుకు స్థాన చలనం కలిగిస్తున్నారు. అర్బన్‌లో ఉన్నవారు మాత్రం అంగుళం కూడా కదలడం లేదని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఈ సారైనా తమకు మోక్షం కలిగించాలని దీర్ఘకాలంగా గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుళ్లు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఇలా పలువురు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు సుదీర్ఘకాలం పాటు గ్రామీణ ప్రాంతాల్లోనే పనిచేస్తుండగా.. కొందరైతే 28ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాలకే పరిమితమయ్యారు.

మొదలైన బదిలీ ప్రక్రియ

ఈ సారి కూడా ఇలాగే కొనసాగితే తమ పరిస్థితి ఏమిటని కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం నుంచి బదిలీల ప్రక్రియ మొదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. నాలుగేళ్లకుపైగా ఒకే చోట పని చేస్తున్న ఉద్యోగులు ఆప్షన్స్ ఇచ్చుకుంటున్నారు. 12వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ జరగనుండగా.. 13వతేదీ నుంచి 19వరకు దరఖాస్తుల పరిశీలన, ఆ తర్వాత బదిలీలు జరుగుతాయి. వరంగల్‌లో నాలుగు ఎక్సైజ్ స్టేషన్లు- కాజీపేట, హనుమకొండ స్టేషన్, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ ఉన్నాయి. వీటితో పాటు డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్సు (టీడీఎఫ్) హనుమకొండ, వరంగల్ కార్యాలయాలు, ఉమ్మడి వరంగల్ మొత్తానికి ఒక ఎన్‌ఫోర్సుమెంట్ కార్యాలయం ఉన్నాయి. వీటి పరిధిలోనే సుమారు 70 మంది వరకు పని చేస్తున్నారు. నాలుగు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో సమారు 30 మంది విధులు నిర్వహిస్తున్నారు. వరంగల్ జిల్లాలో ఎక్సైజ్ శాఖలో మొత్తం 180 మంది ఉద్యోగులున్నారు.

లోక్‌సభ ఎన్నికలకు ముందు..

ఇటీవల లోకసభ ఎన్నికలకు ముందు ఎక్సైజ్ శాఖలో ఉన్నతాధికారులు స్థాయిలో పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయి. ఎన్నికలతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం ఉన్న అధికారులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం మేరకు ఈ బదిలీలు జరిగాయి. ఈ శాఖలో ఒకే సారి 223 మంది బదిలీ అయ్యారు. అయితే గత నవంబరులో అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన జరిగిన బదిలీల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అప్పటి ఒక మంత్రి అండదండలతో 30మంది ఎక్సైజ్ అధికారులను బదిలీ చేసి కీలక స్థానాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై విచారణ చేపట్టింది. అక్రమ పోస్టింగ్‌లను రద్దు చేసింది. అయితే ఉద్యోగుల స్థాయిలో ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో అధికారులు నిబంధనల మేరకు బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

వరద ముంపును ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టండి

- మేయర్ గుండు సుధారాణి
- ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌తో కలిసి పలు చోట్ల పరిశీలన



వడ్డెపల్లిలో పర్యటిస్తున్న మేయర్, కమిషనర్, ఈఎన్‌సీ

వరంగల్ కార్పొరేషన్, జూలై 9 : ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో రానున్న వరద ముంపును ఎదుర్కొనేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం ఇంజనీరింగ్ ఇన్- చీఫ్ మహమ్మద్ జియావుద్దీన్, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వడ్డెపల్లిబండ్, జవహర్ నగర్, అంబేద్కర్ భవన్ ప్రాంతం, హనుమకొండ బస్‌స్టేషన్, ములుగురోడ్డు, ప్రభుత్వ ఐటీఐ, కొత్తవాడ, కాశిబుగ్గ, పద్మనగర్‌లలో పర్యటించారు. మేయర్, కమిషనర్ ఇక్కడి పరిస్థితిపై ఇంజనీరింగ్ ఇన్- చీఫ్‌కు వెల్లడించగా ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ.. గతంలో నగరంలో కొన్ని ప్రాంతాలు వర్షాలకు నీట మునిగాయని, ఈ సారి ఆ పరిస్థితి రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈఎన్‌సీ మాట్లాడుతూ.. వర్షాకాలంలో వర్షపు నీరు సాఫీగా వెళ్లడానికి నాలా విస్తీర్ణం ఎంత వెడల్పు ఉండాలో డిజైన్ చేసి డీపీఆర్ సిద్ధం చేయాలన్నారు. మ్యూజికల్ గార్డెన్ పై వైపున ఉండే నాలాలను వెడల్పు ఉండేలా డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఆక్రమణలు తొలగించి కచ్చా నాలాల ద్వారా నీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్‌ఈ కృష్ణారావు, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ శ్రీనివాస్‌రావు, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈలు రాజయ్య, బీఎల్ శ్రీనివాసరావు, సంజయ్‌కుమార్‌లతో పాటు స్థానిక కార్పొరేటర్ రాములు పాల్గొన్నారు.

సీపీ మామునూరు పీఎస్ తనిఖీ



శంభునిపేట, జూలై 9 : వరంగల్ కమిషనరేట్ పరిధిలోని మామునూరు పోలీసు స్టేషన్‌ను మంగళవారం రాత్రి కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది విధులపై ఆరా తీశారు. విధుల్లో అలసత్వం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలకు సేవలందించేందుకు స్టేషన్ అధికారులు నిరంతరం పోలీసు స్టేషన్‌లో అందుబాటులో ఉండాలన్నారు. క్రమశిక్షణతో అనుక్షణం శాంతిభద్రతలను కాపాడాలన్నారు.

భార్యను చంపి భర్త ఆత్మహత్య

- కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే కారణం
- ముగ్గురు పిల్లల్ని బావమరిది ఇంటికి పంపి ఘాతుకం
- తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో చిన్నారులు
- సోమవారం రాత్రి దారుణం.. మంగళవారం ఉదయం వెలుగులోకి
- కంటతడి పెట్టించిన చిన్నారుల రోదన
- వరంగల్‌లోని చెన్నారెడ్డినగర్‌లో విషాదం



స్వప్న, చరణ్(ఫైల్)

7 లో..

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి.. : కలెక్టర్
- కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆకస్మిక తనిఖీ



మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 9: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సత్య శారదాదేవి హెచ్చరించారు. మంగళవారం ఖిలావరంగల్ మండలంలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉంటుందా, యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఆవరణలోని పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ సమర్థ నిర్వహణకు హెడ్మాస్టర్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాధవి, జయప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను మార్చాలని డీఈవోకు ఆదేశం..

హెడ్మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.మాధవిని పాఠశాల నుంచి మార్చాల్సిందిగా కలెక్టర్ సత్య శారదదేవి డీఈవో వాసంతిని ఆదేశించారు. విద్యార్థులను దండించినట్లు ఇటీవల తల్లిదండ్రులు మంత్రి సురేఖ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాల స్థితిగతులను, మధ్యాహ్న భోజన వివరాలను, ఉపాధ్యాయుల వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 26న జరిగిన సంఘటనపై 28న కలెక్టర్ ఆదేశాలతో డీఈవో విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. డీఈవో విచారణలో హెడ్మాస్టర్ మాధవి విద్యార్థులతో ప్రవర్తించిన తీరు సరిగా లేదని వివరించడంతో ఆమెను పాఠశాల నుంచి మార్చాల్సిందిగా డీఈవోను ఆదేశించారు. దీంతో హెడ్మాస్టర్ మాధవిని చార్‌బౌళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మారుస్తూ డీఈవో వాసంతి ఉత్తర్వులు జారీ చేశారు.



అడవి బిడ్డలకు అక్షరాభ్యాసం

7

- గొత్తికోయగూడెంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు
- ప్రారంభించిన మంత్రి సీతక్క
- చిన్నారి తులసి కోరిక మేరకే నిర్మించామని వెల్లడి

వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలి

- సీఎస్ శాంతి కుమారి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

వరంగల్ కలెక్టరేట్, జూలై 9: సీజనల్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, డెంగీ, మలేరియా, చికున్ గున్యా కేసుల వ్యాప్తిని అరికట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ వన మహోత్సవం, ప్రజా పాలన సహాయ కేంద్రాల నిర్వహణ, మహిళా శక్తి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు, వర్షాకాలం పంటల సాగు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ సత్యశారదా దేవి మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో 25.58లక్షలు కాగా ఇప్పటి వరకు 43శాతం సాధించమన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా 438 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను గుర్తించి ఇప్పటి వరకు 232 పాఠశాలల్లో పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన పనులను వారంలోగా పూర్తి చేస్తామన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్‌ఓ అనుజ్ అగర్వాల్, ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీఈవో వాసంతి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- జీపీ బిల్లుల చెల్లింపునకు రూ.50వేల డిమాండ్
- అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించిన బాధితుడు
- వల పన్ని పట్టుకున్న అధికారులు



కంచనపల్లి కార్యదర్శి పడిగె శివాజీని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు

రఘునాథపల్లి, జూలై 9: నెల నెలా ఠంచన్‌గా వేలల్లో జీతం.. ఆపై అప్పుడప్పుడు దొరికే అమ్యామ్యాలు.. అయినా అతడిలో డబ్బుపై ఆశ చావలేదు. అత్యాశకుపోయి చివరికి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గవ్వాని విజయ భర్త నాగేశ్వరరావు గతంలో జీపీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేశారు. వాటికి సంబంధించి రూ.1.53 లక్షలు జీపీ జనరల్ ఫండ్ నుంచి రావాల్సి ఉంది. అయితే వాటిని చెల్లించేందుకు కార్యదర్శి శివాజీని సంప్రదించగా, రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకాకుండా రూ.20 వేలు ఇచ్చేందుకు నాగేశ్వర్‌రావు ఒప్పుకున్నారు. ఆ తర్వాత డబ్బుల కోసం పలుమార్లు శివాజీ ఒత్తిడి చేశారు. దీంతో విసుగు చెందిన నాగేశ్వర్‌రావు వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. డీఎస్పీ సాంబయ్య సూచనల ప్రకారం నాగేశ్వరరావు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న చెట్టు వద్దకు వచ్చారు. అక్కడ కార్యదర్శి శివాజీ రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని శివాజీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్ రెడ్డి, సట్ల రాజు, ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

విసుగొచ్చి ఏసీబీని ఆశ్రయించా..

గవ్వాని నాగేశ్వరరావు, బాధితుడు



చేసిన పనులకు బిల్లులు చెల్లించేందుకు గ్రామ కార్యదర్శి శివాజీ లంచం డిమాండ్ చేయడం.. ఈ విషయంలో పలుమార్లు ఒత్తిడి తేవడంతో భరించలేక ఏసీబీని ఆశ్రయించా. జూలై 2023 నుంచి చేసిన పనుల కోసం ఖర్చు చేసిన రూ.1.53 లక్షలు జీపీ జనరల్ ఫండ్ నుంచి ఇచ్చేందుకు కార్యదర్శి శివాజీ లంచం అడిగారు. ఏసీబీ అధికారులు అండగా ఉంటామని చెప్పడంతో పంచాయతీ కార్యదర్శిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించా.

లంచం అడిగితే సమాచారం ఇవ్వండి..

అధికారులు ఏదైన పని కోసం లంచం అడిగితే టోల్‌ఫ్రీ నెంబరు 1064కు సమాచారం ఇవ్వాలని వరంగల్ ఏసీబీ డీఎస్పీ పి.సాంబయ్య సూచించారు. లంచం తీసుకోవడంతో పాటు ఇవ్వడం కూడా నేరమని గుర్తించుకోవాలన్నారు. ఎవరైనా అధికారులు లంచం కోసం వేధిస్తే తమను సంప్రదించాలని కోరారు.

శాంతి భద్రతలే లక్ష్యంగా..

కమిషనరేట్ పరిధిలో సీపీ ప్రత్యేక దృష్టి

రాణాల ఆకస్మిక తనిఖీలు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌పై ఫోకస్



హనుమకొండ స్టేషన్ తనిఖీ చేస్తున్న సీపీ(ఫైల్)



అర్ధరాత్రి సీపీ నగరంలో పెట్రోలింగ్ (ఫైల్)

వరంగల్ క్రైం, జూలై 9: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా సీపీ అంబర్ కిషోర్ ఝూ నడుబిగించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా నిర్వహించిన ఆయన స్టేషన్లలో పోలీస్ అధికారులు అందుబాటులో ఉండాలని గతంలోనే ఆదేశించారు. ఈ క్రమంలో తరచూ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేయడంతో పాటు కమిషనరేట్‌కు వచ్చిన బాధితుల సమస్యలను స్వయంగా తెలుసుకుంటున్నారు. అప్పటికప్పుడు పలు సమస్యలను పరిష్కరిస్తున్న ఆయన పోలీస్ అధికారులపై వచ్చిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని అటాచ్ చేయడం, స్టేషన్లు మార్చి పోస్టింగ్‌లు ఇస్తున్నారు. గంజాయి, బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు చేపట్టారు. మొత్తంగా గతంలో కమిషనరేట్ పరిధిలో పనిచేసిన అనుభవంతో అంబర్ కిషోర్ ఝూ శాంతి భద్రతల పరిరక్షణకు పక్కా ప్రణాళికలతో వెళుతున్నారు.

ఆకస్మిక తనిఖీలతో హడల్

పలు స్టేషన్‌లలో ఎస్‌హెచ్‌వోలు అందుబాటులో ఉండటం లేదని, ఫిర్యాదులను పెండింగ్‌లో పెడుతున్నారని, బాధితుల పట్ల పోలీసుల ప్రవర్తన బాగోడం లేదన్న ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆయన కమిషనరేట్ పరిధిలోని స్టేషన్ల తనిఖీ చేపట్టి ఉద్యోగులను హడలెత్తించారు. ఆకస్మిక తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది హాజరు, ఆరోజు వచ్చిన ఫిర్యాదులు, పెండింగ్ కేసుల వివరాలు తదితర విషయాలను పరిశీలిస్తున్నారు. అందుబాటులో ఉండని సిబ్బందికి వార్నింగ్ ఇచ్చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు సీఐలు, ఎస్ఐలను ఇటీవల అటాచ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే కమిషనరేట్ పరిధిలో అర్ధరాత్రి వేళ హటాత్తుగా రోడ్లపై పెట్రోలింగ్ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం అంబర్ కిషోర్ ఝూ ట్రై సిటీస్‌లో అర్ధరాత్రి పెట్రోలింగ్ చేసి హడలెత్తించారు. వరంగల్ మండిబజార్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు తనిఖీలు చేసారు. వ్యాపారస్తులు సకాలంలో షాపులు బంద్ చేయాలని సూచించారు. రోడ్లపై వాహనాల తనిఖీలు సైతం చేసిన అంబర్ కిషోర్ ఝూ అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించాలని అధికారులకు ఆదేశించారు. కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్‌కు ఆకస్మికంగా వెళ్లిన ఆయన రైల్వేస్టేషన్‌లో తరచూ సంచరించే అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించాలని సూచించారు. కమిషనర్ ఆకస్మిక తనిఖీలతో అధికారులు అప్రమత్తమయ్యారు. స్టేషన్లలో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉన్నట్టు కనిపిస్తోంది.

ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ

కాగా శాంతి భద్రతలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన అంబర్ కిషోర్ ట్రాఫిక్ నియంత్రణకు కూడా చర్యలు చేపట్టారు. నయీంనగర్ నాలా పనులు జరుగుతుండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయించడంతో పాటు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులను నియమించారు. మర్కజీ పాఠశాల జంక్షన్ వద్ద డివైడర్లతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఫిర్యాదు అందడంతో స్వయంగా వెళ్లిన పోలీస్ కమిషనర్ వెంటనే డివైడర్‌ను తొలగించి సమస్యకు పరిష్కారం చూపి.. నూతన సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసారు. వాహనాల తనిఖీలు చేపట్టి పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించడం, వాహనాలు సీజ్ చేయాలని ట్రాఫిక్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

యుద్ధాలు మానవాళి మనుగడకు ప్రమాదకరం

ఎంసీపీఐ (యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న మద్దికాయల అశోక్

సుబేదారి, జూలై 9: యుద్ధాలు మానవాళి మనుగడకు ప్రమాదకరమని ఎంసీపీఐ (యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. ఎంసీపీఐ (యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ రెండు రోజుల సమావేశాలు హనుమకొండ సుబేదారిలోని రాఘవేంద్ర గార్డెన్స్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దారపు రమేష్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో తొలుత పాలస్తీనా, గాజాపై ఇజ్రాయిల్ దేశం సాగిస్తున్న నరమేధంలో, ఉక్రెయిన్, రష్యా దాడుల్లో మరణించిన వారికి, ఇటీవల వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన వారికి, ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు, నిరుద్యోగులకు, హత్రాస్ తొక్కిసలాటలో మరణించిన వారికి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మద్దికాయల అశోక్ మాట్లాడుతూ ప్రపంచంలో శాంతి సౌభ్రాతృత్వం నెలకొల్పి శాంతియుత సహజీవనం కొనసాగించాల్సిన ప్రపంచ దేశాల్లో అమెరికా లాంటి సామ్రాజ్యవాద దేశాలు ఇతర దేశాల సార్వభౌమాధికారంలో జోక్యం చేసుకుంటున్నాయని అన్నారు. సమావేశంలో ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కుంభం సుకన్య, వస్కుల మట్టయ్య, వనం సుధాకర్, గోనె కుమారస్వామి, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, మంద రవి, నాగార్జున పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పలయ్య

కాజీపేట, జూలై 9 : మున్సిపల్ కార్పొరేషన్‌లో విధినిర్వహణలో మృతి చెందిన పారిశుధ్య కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబీకులకు వెంటనే ఉద్యోగాలు కేటాయించాలని, కార్పొరేషన్ ప్రకటించిన రూ 1 లక్ష 50 వేలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. కాజీపేట మినీ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ సిబ్బంది, సీఐటీయూ నాయకులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టి.ఉప్పలయ్య మాట్లాడారు. మున్సిపాలిటీలో ఔట్‌సోర్సి ంగ్‌లో పనిచేస్తూ మరణించిన కార్మిక కుటుంబాలకు కార్పొరేషన్ తీవ్ర అన్యాయానికి గురుచేస్తుందన్నారు. మృతుల కుటుంబీకుల ఉద్యోగాలు ఇవ్వాల్సిన కార్పొరేషన్ కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. కార్మిక కుటుంబాలు కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

హనుమకొండ టౌన్, జూలై 9 : యువత మత్తుకు బానిస కావొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆచార్య రవి రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం సీపీ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో యువత భవిష్యత్ నాశనం కావడమే కాకుండా ఎన్నో కుటుంబాలు ఛిద్రం అవుతున్నాయని, వాటికి దూరంగా ఉండి జీవితంలో ఉన్నతమైన స్థితికి చేరుకోవాలని సూచించారు.

జడ్పీలో బదిలీల ప్రక్రియ షురూ

హనుమకొండ సిటీ, జూలై 9 : జిల్లా పరిషత్‌లో బదిలీల ప్రక్రియ ఆరంభమైంది. అన్ని విభాగాల ఉద్యోగుల బదిలీ ప్రక్రియను అధికా రికంగా చేపట్టారు. ఇందులో భాగంగా ఉద్యోగుల నుంచి ఆగస్టు 12 వర కు బదిలీ దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు. బదిలీలు జరుగ నుండడంతో జడ్పీలో ఉద్యోగుల సందడి నెలకొంది.

ఎంజీఎంలో డీఎంహెచ్‌వో తనిఖీ

వరంగల్ మెడికల్, జూలై 9 : వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన జిల్లా కలెక్టర్ ఎంజీఎం ఆస్పత్రిని తనిఖీ చేసిన సందర్భంలో ఆదేశించిన విధంగా ఆస్పత్రిలో స్టార్టింగ్ ఓపీ, సీసీ కెమెరాలు ఏర్పాటు, ఓసీలో కుర్చీల ఏర్పాటు తదితరాలపై తనిఖీ చేశారు. అనంతరం ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి మాట్లాడిన అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేసినట్లు తెలిసింది.

కేయూ ఇంజనీరింగ్ డీన్ బదిలీ

కేయూ క్యాంపస్, జూలై 9: కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం డీన్, కేయూ మహిళ, కో ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందంను వర్సిటీ కళాశాల నుంచి కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు కేయూ ఉన్నతాధికారులు సదానందంను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. సదానందం బదిలీతో వర్సిటీ క్యాంపస్‌లోని రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు తాత్కాలికంగా ఇద్దరూ అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఇన్‌చార్జిలుగా నియమించినట్లు తెలిసింది. అయితే ప్రొఫెసర్ సదానందం తన తమ్ముడికి ఆరోగ్యం బాగా లేదని బదిలీ తాత్కాలికంగా అపాలని వర్సిటీ ఉన్నతాధికారులను కలిసి విన్నవించినట్లు తెలిసింది. తక్షణమే వర్సిటీ కళాశాల నంచి రీలివై కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలిసింది.

ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలి

యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేశ్‌నాయక్

హనుమకొండ టౌన్, జూలై 9 : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేశ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం లష్కర్ బజార్‌లోని ప్రాక్టీసింగ్ ప్రైమరీ పాఠశాల, ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొం టున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేశ్‌నాయక్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, స్కావెంజర్స్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నారన్నారు. జిల్లా అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధ్యాయనం చేసి పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. పూర్తి స్థాయి ఉపాధ్యాయులు లేక, ఇన్‌చార్జి హెచ్‌ఎంలతో విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందని వెంటనే సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ టౌన్ సెక్రెటరీ హరీశ్, జిల్లా నాయకులు రాజేశ్, రాకేశ్, శివ పాల్గొన్నారు.

భార్యను చంపి భర్త ఆత్మహత్య

- కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే కారణం
- ముగ్గురు పిల్లల్ని బావమరిది ఇంటికి పంపి దుశ్చర్య
- తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో చిన్నారులు
- సోమవారం రాత్రి దారుణం.. మంగళవారం ఉదయం వెలుగులోకి
- కంటతడి పెట్టించిన చిన్నారుల రోదన
- వరంగల్‌లోని చెన్నారెడ్డినగర్‌లో విషాదం


స్వప్న మృతదేహం


బిక్కుబిక్కుమంటూ ఉన్న ముగ్గురు పిల్లలు

ఖిలావరంగల్, జూలై 9: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు ఆ ఇంట్లో చిచ్చురేపాయి.. దీంతో జీవితంపై విరక్తి చెందిన భర్త భార్యను చంపి.. ఆ తర్వాత తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ విషాదకర ఘటన వరంగల్ నగరంలోని 18వ డివిజన్ చెన్నారెడ్డి కాలనీలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

చెన్నారెడ్డికాలనీకి చెందిన మంద చరణ్ (45), మంద స్వప్న(40) దంపతులకు 18ఏళ్ల క్రితం వివాహం జరగ్గా, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు జన్మించారు. కుమారుడు అంధత్వంతో బాధపడుతుండగా చరణ్ భవన నిర్మాణ మేస్త్రీగా, స్వప్న కూరగాయల మార్కెట్‌లో కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కానీ కొద్దిరోజుల నుంచి చరణ్, స్వప్న దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. వాటికి ఆర్థిక ఇబ్బందులు కూడా తోడయ్యాయి. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం చరణ్ తన ముగ్గురు పిల్లలను వరంగల్‌లోని ఉర్సు ప్రాంతంలో నివాసం ఉండే తన బావమరిది ఇంట్లో దింపేసి వచ్చాడు. రాత్రి ఇంట్లో చరణ్, స్వప్న దంపతులు మాత్రమే ఉండగా రాత్రివేళ ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో ఆగ్రహావేశానికి లోలైన చరణ్ రోకలి బండతో స్వప్నపై దాడి చేయడంతో తలకు బలమైన గాయమై స్వప్న మృతి చెందింది. ఆమె చనిపోయినట్టు నిర్ధారించుకున్నాక అప్పటికే తాను తెచ్చుకున్న పురుగుల మందును తాగి చరణ్ ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం తమ మామయ్య ఇంటి నుంచి ఆటోలో తిరిగి వచ్చిన ముగ్గురు పిల్లలు తల్లి రక్తపు మడుగులో, తండ్రి విగతజీవిగా కనిపించడంతో భయంతో బిగ్గరగా కేకలు వేస్తూ ఏడ్చారు. చిన్నారుల ఏడుపు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని 100కి డయల్ చేసి సమాచారమివ్వగా మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు మార్చురీకి తరలించారు. మృతుడి పెద్ద కుమార్తె గ్రేసీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

దిక్కుతోచని స్థితిలో చిన్నారులు..

తల్లిదండ్రులు కోల్పోయిన ముగ్గురు పిల్లలు దిక్కుతోచని స్థితిలో మిగిలారు. పెద్దకుమార్తె గ్రేసీ ఏడో తరగతి వరకు చదువుని ఇంట్లోనే ఉంటోంది. చిన్న కుమార్తె మెర్సీ గుండెకు రంధ్రం ఉండటంతో ఆపరేషన్ చేయించే పరిస్థితి లేక తరచూ అనారోగ్యంతో బాధపడుతూ ఆమె కూడా స్కూల్‌కు వెళ్లడం లేదు. ఇక ఒక్కగానొక్క కుమారుడు శాలూమ్ కూడా అంధుడు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. తమ కుటుంబ దీన స్థితికి తోడు ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడం, ఈ క్రమంలోనే భార్యాభర్తల మధ్య కలహాలు ప్రారంభం కావడంతో ఆత్మస్థైర్యం కోల్పోయి, జీవితంపై విరక్తితో చరణ్ ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటాడని బంధువులు, స్థానికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

కంటతడిపెట్టించి చిన్నారుల రోదన

తమ మామయ్య ఇంటి నుంచి ఆనందంగా ఇంటికి వచ్చిన గ్రేసీ, మెర్సీ, శాలూమ్ ఇంటి తలుపు తీయగా తల్లిదండ్రులు చనిపోయి కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడివారిని కంటతడి పెట్టించింది. ఇంటిముందు నిలబడి 'అమ్మా..నాన్నా..' అంటూ విలపించడం అక్కడి వారిని కలిచివేసింది.

ఔదార్యం చాటుకున్న పోలీసులు

కరీమాబాద్ : మిల్స్‌కాలనీ పోలీసులు ఔదార్యాన్ని చాటుకున్నారు. లేబర్‌కాలనీకి చెందిన మంద చరణ్-స్వప్న దంపతులు మృతిచెందడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ముగ్గురు చిన్నారులను చూసి చలించిపోయారు. ముఖ్యంగా శాలూమ్ అంధుడు కావడంతో స్పందించిన సీఐ మల్లయ్య రూ.10వేలు, ఎస్సైలు చందర్, శ్రీకాంత్ రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అలాగే 18వ డివిజన్ కార్పొరేటర్ వస్కుల బాబు, కాంగ్రెస్ నాయకుడు గడ్డమీది రాజేష్ రూ.5వేలు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్ రూ. 5వేలు అందించి మానవత్వంచాటుకున్నారు.

భక్తిశ్రద్ధలతో సీత్లా పండుగ

ప్రత్యేక పూజలు చేసిన మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 9 : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం గిరిజనులు సీత్లా పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. యావత్ గిరిజన జాతిమొత్తం ఒకేరోజు పండుగను ఆనందోత్సవాల నడుమ నిర్వహించుకున్నారు. సీత్లాభవాని ఘాట్ వద్దకు గిరిజన మహిళలు సంప్రదాయబద్ధంగా నైవేద్యాలు (పాయాసం)తో పాటు ప్రత్యేక వంటకాలు చేసుకుని సీత్లాభవాని అమ్మవారికి సమర్పించారు. ఆట, పాటలతో నృత్యాలు చేస్తూ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ప్రతీ గిరిజన తండాల్లో చిన్నాపెద్ద అనే తారతమ్యం లేకుండా ఈ వేడుకల్లో పాల్గొని, ప్రకృతిని ఆరాధిస్తూ కులదేవతను పూజించారు.

- మహబూబాబాద్ శివారు వీరారంతండాలో నిర్వహించిన వేడుకల్లో సీత్లాభవాని అమ్మవారికి స్థానిక శాసన సభ్యులు భూక్య మురళీనాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీను, డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్ పాల్గొన్నారు. గుండ్లబోడుతండాలో నిర్వహించిన వేడుకల్లో సేవాలాల్ సేనా రాష్ట్ర కోకన్వీనర్ వెంకన్ననాయక్, నాయకులు మోతీలాల్, బన్సీలాల్, శంకర్, బాలు,చంద్రు, లింగన్న, రవి, భద్రు, మాలు, సంజీవ, శ్రీను, రమేష్, మంగిలాల్, సరిత, మౌనికబాయి, మీనా, శారద, సునీత పాల్గొన్నారు. వినాయకతండాలో సీత్లాపండుగను పురస్కరించుకుని సీత్లాభవానికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ శంకర్‌నాయక్, దారావత్ హంక్లా, బానోత్ సక్రాం, సురేష్, విజయ్, రమేష్, బిచ్యా, వస్రం పాల్గొన్నారు.


మహబూబాబాద్ శివారు వీరారంతండా సీత్లాపండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్


మహబూబాబాద్ వినాయక తండాలో సీత్లాభవానికి నైవేద్యం సమర్పించేందుకు వెళ్తున్న తండవాసులు

వివిధ మండలాల్లో..

మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని బోడ అమృతండ, సబ్‌స్టేషన్‌తండ, లోక్యతండ, జామతండ, అర్లగడ్డతండ, నేతావత్‌తండ, లూనావత్‌తండతో అన్ని గిరిజన గూడాల్లో సీత్లాపండగ వేడుకలు నిర్వహించారు.

- దంతాలపల్లి మండలంలోని తూర్పుతండ, దుబ్బతండ, రెక్యతండాలో గిరిజనులు సీత్లాభవాని పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంజి, నాయకులు పాల్గొన్నారు.
- గూడూరు మండలం సీతానగరం శివారు రాళ్లవాగు దస్రుతండ, ఏపూరు గ్రామాల్లో సీత్లాభవాని వేడుకలు నిర్వహించారు. భూక్య మంగీలాల్, లక్ష్మణ్, వాంకుడోతు గోపినాథ్, వాంకుడోతు మోతీలాల్, శ్రీను, రమేష్, సురేష్, బిచ్చు, సర్దార్, బాబు, రాములు, వెంకటేష్, గోపిచంద్ పాల్గొన్నారు.
- బయ్యారం మండలంలోని అన్ని లంబాడ గిరిజన తండాల్లో, గూడాల్లో సీత్లాభవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. అయా కార్యక్రమాల్లో తండా పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
- చిన్నగూడూరు మండలం మేగ్యతండాలో నిర్వహించిన వేడుకల్లో తండాపెద్ద బాదావత్ రెడ్డి, బాను, చంద్రు, సురేష్, జ్యోతిరాము, భూక్య వెంకన్న, చిరంజీవి, రాంబాబు, శంకర్, శివ, సాయిరాం, రవి, మల్లేశ్వర్, దస్రూ పాల్గొన్నారు.
- సీరోలు మండలం కాంపల్లి సక్రాంనాయక్‌తండాలో నిర్వహించిన వేడుకల్లో తేజావత్ రవీందర్, బిచ్చు, ఈశ్వర్, సేట్యా బానోత్ వీరన్న, తేజావత్ వీరన్న, నరేష్, రాములు, సతీష్ పాల్గొన్నారు.
- పెద్దవంగర మండలంలో సీత్లాభవాని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలలో పాల్గొని నైవేద్యాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పానుగోతు ప్రదీప్‌నాయక్, రఘులాల్‌నాయక్, రామచంద్రు, అమర్‌సింగ్, ధూమా, ప్రవీణ్, కల్యాణి, మంగమ్మ, మహిళలు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి టూ-డే క్రికెట్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 9 : వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వరంగల్‌లోని దేశాయిపేట సీకేఎం కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి టూ-డే క్రికెట్ లీగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబ ర్చిన క్రీడాకారులను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై రెండవ వారం నుంచి హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్న టూ-డే క్రికెట్ లీగ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. 25 సంవత్సరాల వయస్సు లోపు, 31 ఆగస్టు 1999 సంవత్సరం తర్వాత పుట్టిన ఔత్సాహిక క్రికెట్ క్రీడాకారులు అర్హులను తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 11న ఉదయం 10గం టలకు సీకేఎం కళాశాల క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలని శ్రీనివాస్ వెల్లడించారు. మరిన్ని వివరాలకు-98495 70979 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

హనుమకొండ ఎఫ్ఏసీ డీఈవోగా వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 9 : హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారిగా డి. వాసంతికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీఈవోగా పనిచేస్తున్న డాక్టర్ ఎండీ. అబ్దుల్ హై అనారోగ్యానికి గురికావడంతో ఆయన రెండు నెలల పాటు సెలవు పెట్టారు. దీంతో వరంగల్ ఎఫ్ఏసీ డీఈవోగా పనిచేస్తున్న డి.వాసంతికి హనుమకొండ బాధ్యతలు అప్పగించారు.

అడవి బిడ్డలకు అక్షరాభ్యాసం

- గొత్తికోయగూడెంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు
- ప్రారంభించిన మంత్రి సీతక్క
- చిన్నారి తులసి కోరిక మేరకే నిర్మించామని వెల్లడి

మేడారం, జూలై 9: మారుమూల అటవీ ప్రాంతంలో.. గొత్తికోయ బిడ్డలు చదువుకోనేలా మంత్రి సీతక్క చూపిన చొరవ చూపడంతో సర్కారు పాఠశాల ప్రారంభమైంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్ పంచాయతీ పరిధి గొత్తికోయగూడెమైన తక్కెళ్లపల్లి గూడేనికి చెందిన చిన్నారి పూణెం తులసి ఆ కార్యక్రమంలో నాటిక ప్రదర్శన ఇవ్వగా.. ఆమె ప్రదర్శనను మెచ్చిన మంత్రి సీతక్క 'నీకేం కావాలి తల్లీ' అని ఆ చిన్నారిని సీతక్క అడగ్గా 'మా గ్రామానికి పాఠశాల కావాలి' అని ఆ చిన్నారి టక్కున సమాధానం ఇచ్చింది. అందుకు మంత్రి స్పందించి పాఠశాల నిర్మాణానికి ముందడుగు వేశారు. దాతల ఆర్థిక సహకారం, పోలీసు శాఖ పర్యవేక్షణలో నిర్మితమైన ఆ పాఠశాల భవనం మంత్రి సీతక్క చేతుల మీదుగా మంగళవారం ప్రారంభమైంది. ములుగు ఎస్పీ శబరీశ్, ఓఎస్డీ మహేష్ గీతెతో కలిసి మంత్రి తాక్కెళ్లగూడెం గొత్తికోయగుంపులో పాఠశాల భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారి పూణెం తులసి కోరిక మేరకే గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. నీకేం కావాలని అడగ్గానే తమ గ్రామానికి పాఠశాల కావాలని ఆ చిన్నారి చెప్పడం తననెంతో ప్రభావితం చేసిందని మంత్రి ఆనందాన్ని వ్యక్తం చేశారు. గూడెంలో పాఠశాలను నిర్మించాల్సిన ఆవశ్యతకను ఎస్పీ శబరీశ్‌కు వివరించానన్నారు. అటవీ శాఖ అనుమతులతో 15 రోజుల్లో రూ.8.5లక్షలతో భవన నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. దీనికి డాక్టర్ తరుణ్‌రెడ్డి రూ.1.50లక్షలు ఆర్థిక సాయం అందించగా రూ.3లక్షలు ఎస్పీ సమకూర్చారని, కలెక్టర్ నిధుల నుంచి రూ.4లక్షలు కేటాయించారని వివరించారు. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డితో పాటుగా శ్రమించిన తాడ్వాయి పోలీసు బృందాన్ని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. ఎస్పీ శబరీశ్ మాట్లాడుతూ 31కుటుంబాలు ఉన్న తక్కెళ్లగూడెం ప్రజల జీవితాల్లో అక్షర వెలుగులు నింపడానికి ఈ పాఠశాల దోహదపడుతుందన్నారు. పిల్లలే కాకుండా పెద్దలు కూడా ఖాళీ సమయంలో అక్షరాభ్యాసం చేయాలని సూచిం చారు. అలాగే గూడెం వాసులకు హనుమకొండలోని చక్రవర్తి హాస్పిటల్‌లో ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్టు తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క చేతుల మీదు గా గొత్తికోయ పిల్లలకు పుస్తకాలు, స్కూల్ యూనిఫాం పంపిణీ చేశారు.


స్కూల్ భవనం ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

గూడెంలో మంత్రి పుట్టిన రోజు వేడుకలు

ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో తక్కెళ్లగూడెంలో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు జరిగాయి. గూడెం వాసులతో కలిసి కేక్ కట్ చేసిన సీతక్క పిల్లలకు, పెద్దలకు, పోలీసులకు, కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐ జి.రవీందర్, పోలీసులు సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

- ఇల్లు అమ్మినా తీరని ఆర్థిక ఇబ్బందులు
- భీమదేవరపల్లి మండలం వంగరలో విషాదం

భీమదేవరపల్లి, జూలై 9 : వారికి ఎలాంటి వ్యవసాయ భూమి లేదు. భార్యభర్త ఇద్దరూ కష్టపడి పనిచేసుకునేవారు. ఈ క్రమంలోనే ఆ మహిళ కౌలు రైతుగా మారింది. నాలుగెకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని భర్తతో కలిసి పంటలు సాగు చేసింది. అలాగే తన కూతురు వివాహం కూడా చేసింది. కానీ గతేడాది వర్షాలు కురవకపోవడంతో పత్తి, వరి పంటలు ఎండిపోయి ఆ దంపతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. అటు పంట పెట్టుబడులు.. ఇటు కూతరు వివాహం కోసం చేసిన అప్పులు మొత్తం రూ. 15లక్షలయ్యాయి. చివరకు ఆ అప్పు తీర్చే దారిలేక తమ సొంత ఇంటిని అమ్మారు. అయినా ఆర్థిక సమస్యకు పరిష్కారం దొరకలేదు. దీంతో దంపతులిద్దరూ తీవ్ర మనోవేదనలో ఉన్నారు. ఈ క్రమంలోనే ధైర్యం చెడిన ఆ ఇల్లాలు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద సంఘటన భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో జరిగింది. వంగర ఎస్ఐ నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం వంగర గ్రామానికి చెందిన ఏలూరి సునీత(40), శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. ఎలాంటి వ్యవసాయ భూమి లేకపోవడంతో వారు నాలుగెకరాల భూమిని కౌలు తీసుకొని గతేడాది పత్తి, వరి పంటలు వేశారు. కానీ తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటలు పూర్తిగా ఎండిపోయాయి. కళ్ల ముందే పంటలు ఎండిపోవడంతో భూమి యజమానికి చెల్లించాల్సిన కౌలు డబ్బులు, పెట్టుబడిగా తెచ్చిన అప్పులు మరింత భారంగా మారాయి. అలాగే అదే ఏడాది కూతురు వివాహం కూడా చేయడంతో వారు చేసిన అప్పులు రూ.15లక్షలయ్యాయి. ఇటీవల అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు పెరగడంతో గత్యంతరం లేక తాము నివసిస్తున్న ఇంటిని రూ.7లక్షలకు విక్రయించి అప్పులు చెల్లించగా.. మరో రూ.8లక్షలు తీర్చే దారిలేకుండా పోయింది. ఇదే మనోవేదనలో భార్యభర్తలిద్దరూ ఉండగా మంగళవారం తెల్లవారు జామున సునీత ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగింది. ఉదయం సమయంలో నిద్రలేచిన భర్త శ్రీనివాస్‌రెడ్డి సునీత అపస్మారక స్థితిలో ఉండటాన్ని చూసి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. సునీత మృతితో వంగరలో విషాద ఛాయలు అలముకోగా.. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. భర్త శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.


సునీత మృతదేహం

సందడిగా జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపికలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాజరైన 40 మంది క్రీడాకారులు


జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో స్విమ్మింగ్ అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 9 : వరంగల్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్‌పూల్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు మంగళవారం సందడిగా ప్రారంభమయ్యాయి. సబ్‌జూనియర్స్, జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించిన పోటీలలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 40మంది బాలబాలికలు పాల్గొనడం జరిగిందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వామిచరణ్ తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ఫ్రీస్టైల్, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్ బటర్‌ఫ్లై, ఇండివిజల్ మిడ్‌లే విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 13, 14 తేదీలలో సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించనున్న అంతర్ రాష్ట్రాల సబ్‌జూ నియర్స్, జూనియర్స్ బాలబాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా చైర్మన్ సునీల్‌రెడ్డి, అధ్యక్షుడు కందు కూరి రాజేంద్రప్రసాద్, సభ్యులు కందుకూరి సంజయ్‌కృష్ణ, డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు అడవిలో నెమలి సంచారం


గూడూరు అటవీప్రాంతంలో సంచరిస్తున్న నెమలి

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జూలై 9 : గూడూరు శివారు చంద్రుగూడెం అటవీ ప్రాంతంలో మంగళవారం జాతీయపక్షి నెమలి సంచారం కన్పించింది. అటవీ శాఖ అధికారుల ర క్షణ చర్యల్లో భాగంగా వన్యప్రాణులు, పక్షులు సంచారం ఎక్కువగా కన్పిస్తోంది. తాజాగా చంద్రుగూడెం అటవీప్రాంతంలో నెమలి కన్పించడంతో చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

ప్రతి ఇంటా.. గోరింట

- ఆషాఢంలో మహిళల ఆభరణం
- పలు వ్యాధులకు చక్కని ఔషధం



బచ్చన్నపేట, జూలై 9: ఆషాఢం అనగానే మహిళలకు గుర్తుకు వచ్చేది గోరింటాకు. చిన్నారుల నుంచి వయస్సు పైబడిన మహిళలు సైతం గోరింటాకును పెట్టుకోవటానికి ఇష్టపడతారు. వివాహాలు, శుభకార్యాలు రాగానే తొలుత గోరింటాకుకు ప్రాధాన్యతనిస్తారు. ఆషాఢ మాసంలో లేత గోరింటాకులను మెత్తగా రుబ్బి పెట్టుకుంటే బాగా పండుతుందంటారు. గోరింటాకు శాస్త్రీయ నామం లోసోనియా ఇన్నెర్‌మిస్. దీనికి అరబిక్ పేరు హెన్నా. మెహందీగా ఇది సుప్రసిద్ధం. గోరింటాకు వేల ఏళ్ల నాటి నుంచి వాడుకలో ఉందని చెబుతారు. ఇది అలంకరణ కోసమే కాకుండా ఔషధంగా కూడా పనికొస్తుందని నమ్ముతారు. ఆకులను మెత్తగా రుబ్బి ఇందులో కాస్త చింతపండు, పెరుగు కలుపుతారు. అలా తయారైన గోరింటాకు చూర్ణాన్ని చేతులు, పాదాలపైనా మహిళలు పలు రకాల డిజైన్లలో పెట్టుకుంటారు. ఈ గోరింటాకులో హన్నోటిక్ ఆమ్లం ఉంటుంది. ఇది చర్మంలోని కొల్లాజల్ అనే రసాయనంతోనూ, వేలిగోళ్లు, వెంట్రుకల్లో ఉండే కెరాటిన్‌తో బంధం ఏర్పర్చుకోవడంతో ఎర్రగా పండుతుంది. గోరింటాకు గోరింటాకు పువ్వు, ఆకులు, వేర్లు, విత్తనాలను చూర్ణంగా చేసుకుని పెట్టుకోవడం ద్వారా పలు రకాల చర్మ వ్యాధులు, వెంట్రుకలు రాలకుండా ఉండేందుకు, చుండ్రు తొలగించేందుకు, కేశాలంకరణకు ఔషధంగా ఉపయోగిస్తారు.

ఆయుర్వేద, ప్రకృతి వైద్య నిపుణులు చెప్పే ఉపయోగాల్లో కొన్ని..

గోరింటాకు అలంకరణకు, అందానికి మాత్రమే కాకుండా ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆయుర్వేద నిపుణలు చెబుతారు. జ్వరంతో బాధపడుతున్న వ్యక్తి శరీరానికి గోరంటాకు పూయటం వల్ల శరీర ఉష్ణోగ్రత అదుపులోకి వస్తుందని, బాగా నూరిన గోరింటాకును నొప్పిగా ఉన్న కీళ్లపై పెట్టి కట్టు కట్టడం ద్వారా అదుపు చేయవచ్చని చెబుతున్నారు. గోరింటాకును వెనిగర్, నిమ్మరసంతో కలిపిన మిశ్రమాన్ని అనారోగ్యం ద్వారా వచ్చే పాదాల మంటలను అరికట్టేందుకు వాడుతారని, నోటిపూతతో బాధపడేవారు గోరింటాకు కషాయం నోటిలో వేసుకుని పుక్కిలిస్తే తగిన ఫలితం కనిసిస్తుందంటున్నారు. ఇక గోరింటాకు యాంటీబయోటిక్ లక్షణాలను కలిగి ఉండటం మూలంగా కాళ్లకు, చేతులకు పెట్టుకోవడం ద్వారా క్రిములు దరిచేరకుండా ఉంటాయని, దీని నుంచి ఉత్పత్తయ్యే లాసోన్ అనే రంగు పదార్థం సూక్ష్మజీవులను నశింపజేస్తుందని పేర్కొంటున్నారు. గోరింటాకు పువ్వులు సుఖనిద్రను పెంచి తలనొప్పిని దూరం చేయడానికి ఉపయోగపడతాయని, గోరింట చెట్టు బెరడు పచ్చకామెర్లకు, కాలేయ వాపు తీవ్రత తగ్గించడానికి వినియోగిస్తారని, లేత గోరింట పండ్ల నుంచి తయారు చేసిన చూర్ణం శరీరంపై వచ్చే దురదను అదుపు చేస్తుందని చెబుతున్నారు.





వినూత్న వైద్య సేవలు

- ఏజెన్సీ ప్రాంత గిరిజనుల కోసం కంటైనర్ ఆస్పత్రి
- నేటినుంచి అందుబాటులోకి..

తాడ్వాయి, జూలై 9: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని పోసాపూర్‌లో కంటైనర్ ఆస్పత్రి ఏర్పాటైంది. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు అత్యాధునికంగా వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ములుగు కలెక్టర్ టి.ఎస్.దివాకర, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య ఆధ్వర్యంలో దీనిని అందుబాటులోకి తెస్తున్నారు. వర్షాకాలంలో తాడ్వాయి మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో గల బందాల, పోసాపూర్, అల్లిగూడెం, నర్సాపూర్, బొల్లెపల్లి, తదితర గ్రామాలకు వరదల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈప్రాంత గిరిజనులకు వైద్యసేవలకు సైతం ఆటంకం కలుగుతోంది. గతంలో పలువురు అనారోగ్యాలతో మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. వర్షాకాలంలో వైద్యబృందం ఆ గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ఈక్రమంలో ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఒక కంటైనర్‌లో నాలుగు బెడ్లు ఏర్పాటు చేసి వైద్యసేవలతోపాటు సుఖ ప్రసవాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అత్యవసర చికిత్సలు అందించేందుకు వైద్యబృందం నాలుగు నెలలపాటు సిద్ధంగా ఉంటారు. ఈ సీజన్‌లో వివిధరకాల రోగాలకు రక్తనమూనాలు సేకరించి రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారు. ఈ అదనపు ఆస్పత్రిలో ఒక వైద్యాధికారితోపాటు ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం, స్టాఫ్‌నర్సు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో కంటైనర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని సుమారు రూ.7లక్షల వ్యయంతో హైదరాబాద్‌లో రూపొందించి పోసాపూర్‌కు తరలించి సిద్ధంగా ఉంచారు. దీనిపై ఏజెన్సీ ప్రాంత గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




పోసాపూర్‌లో ఏర్పాటుచేసిన కంటైనర్ ఆస్పత్రి, ఆస్పత్రిలో బెడ్లను ఏర్పాటు చేసిన సిబ్బంది



కలెక్టర్‌ను కలిసిన 'కుడా' చైర్మన్

వరంగల్ కలెక్టరేట్, జూలై 9: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఇనుగాల వెంకట్రామిరెడ్డి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలిసి కలెక్టర్ సత్య శారదాదేవికి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుడా చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.



నాగేంద్రుడికి ఆషాఢమాస పూజలు



గీసుగొండ, జూలై 9: ఊకల్‌లోని నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆషాడమాస శుక్లపక్షం శాకంబరీ పూజలు మంగళవారం నిర్వహించారు. సర్పసూక్త విధానంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సముద్రాల శ్రీనివాసాచార్యులు, శ్రీహర్షాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ మాచినపెల్లి బాబురావు, కొత్తగట్టు రాజేందర్, శ్రీరాములు రమేష్ పాల్గొన్నారు.

నేడు వంచనగిరిలో మైసమ్మ బోనాలు

గీసుగొండ, జూలై 9: వంచనగిరిలో కోటగండి మైసమ్మ, రేణుక ఎల్లమ్మ బోనాలను బుధవారం నిర్వహించనున్నారు. మైసమ్మ బోనాలకు మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు హాజరుకానున్నారు. వంచనగిరికి 2 కిలోమీటర్‌ల దూరంలో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిలో ఉన్న కోటగండి మైసమ్మ ఆలయం (కొండగిరి సాయినాథ ఆలయం) వరకు గ్రామస్థులు బోనాలతో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా మంత్రి స్వగ్రామానికి వస్తున్న సందర్భంగా కొండా అభిమానులు, కాంగ్రెస్ నాయకులు భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

అర్ధరాత్రి న్యూసెన్స్ చేస్తే కఠిన చర్యలు

మట్టెవాడ, జూలై 9: నగరంలో అర్ధరాత్రి న్యూసెన్స్ చేసినా, మద్యం మత్తులో హల్‌చల్ చేసినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఆదివారం అర్ధరాత్రి మండిబజార్‌లో మద్యం మత్తులో యువకులు హల్‌చల్ చేయడంపై వరంగల్ పోలీస్ కమిషనర్ సీరియస్ అయినట్లు తెలిసింది. రాత్రి సమయాల్లో అనవసరంగా వాహనాలపై తిరుగుతూ ప్రజలను, వాహనదారులను ఇబ్బంది పెట్టేవారిని, మద్యం మత్తులో వాహనాలపై తిరిగి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. ఇక నుంచి సీఐలు ప్రతిరోజు రాత్రి 12 గంటల వరకు తమ పోలీసు స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహించాలని సీపీ ఆదేశించినట్లు తెలిసింది.

మద్యం మత్తులో హల్‌చల్ చేసిన యువకులపై కేసు

మండిబజార్‌లో ఆదివారం అర్ధరాతి మద్యం మత్తులో వీరంగం సృష్టించిన యువకులపై మట్టెవాడ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో మండిబజార్‌లో మద్యం మత్తులో రోడ్డుపై వాలీబాల్ ఆట అనే వార్త కథనం ప్రచురితమైంది.

స్పందించిన మట్టెవాడ పోలీసులు మంగళవారం తంగిలపల్లి రాజు, రేణుగుండ్ల ప్రవీణ్, ఎర్ర రాకేశ్, అరుణ్, విజయ్‌లపై కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ ఎస్‌ఐ విఠల్ తెలిపారు.

ట్రాఫిక్ తిప్పలు!

అధికారుల తీరుపై నగరవాసులు గరంగరం

రోడ్లపైనే వాహనాల పార్కింగ్

జంక్షన్లలో పనిచేయని సిగ్నల్స్

రోడ్ల అక్రమణలపై చర్యలు శూన్యం

ట్రాఫిక్ దిగ్బంధంలో నగరం



జేపీఎన్ రోడ్డులో రోడ్లపైనే వాహనాల పార్కింగ్

మట్టెవాడ, జూలై 9: వరంగల్ నగరంలోని ప్రధాన జంక్షన్‌లలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో పాటు రోడ్లపైనే యథేచ్ఛగా వాహనాల పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నా ట్రాఫిక్ పోలీసులు, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు,నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్‌లో పలు జంక్షన్‌లలో రోడ్లు దాటడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టంచుకోవడం లేదు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారుల ఫొటోలు తీయడంపైన ఉన్న ఆసక్తి ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వరగల్ చౌరస్తా, కాశిబుగ్గ చౌరస్తా, పోచమ్మమైదాన్ జంక్షన్, హెడ్ పోస్టాఫీసు సెంటర్, పిన్నవారివీధి, ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ ముందు పోతన జంక్షన్, చింతల్ బ్రిడ్జి జంక్షన్, అండర్ బ్రిడ్జి, బీటు బజార్ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ప్రజలు రోడ్లు దాటడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద పోలీసులు సక్రమంగా విధులు నిర్వర్తించకపోవడం, సిగ్నల్స్ పనిచేయక పోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే నడిరోడ్లపై ఆటోలు నిలుపుతున్నా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు.



పోచమ్మమైదాన్‌లో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్



పోచమ్మమైదాన్‌లో ట్రాఫిక్‌జాం

జంక్షన్ జాం..

పోచమ్మమైదాన్ జంక్షన్‌నుంచి నిత్యం వందల సంఖ్యలో అనేక వాహనాలు వస్తుపోతుంటాయి. హన్మకొండ నుంచి వరంగల్ బస్ స్టేషన్‌కు, నర్సంపేట వైపునకు, వరంగల్ చౌరస్తా వైపునకునిత్యం భారీ వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నాలుగు వైపులా ఉండాల్సిన పోలీసులు ఉండకపోవడం, విధుల్లో ఉన్న సిబ్బంది సెల్‌ఫోన్లలో నిమగ్నమవుతుడటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పోచమ్మమైదాన్ జంక్షన్‌లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెడుతున్నారు. కానీ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వరంగల్ చౌరస్తాలోనూ ఇదే తంతు కొనసాగుతుంది. వర్తక, వాణిజ్య కేంద్రాలకు నిలయంగా ఉన్న ఈ ప్రాంతంలో నిత్యం వందల సంఖ్యల ప్రయాణికులు రాకపోకలు జరుగుతుంటాయి. ఇంతేజార్ గంజ్‌కు కూత వేటు దూరంలో ఉన్న వరంగల్ చౌరస్తా ట్రాఫిక్ కూడలిలో నాలుగు వైపుల ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ట్రాఫిక్ సమస్యతో నరకం చూస్తున్నారు. అదేవిధంగా వరంగల్ హెడ్ పోస్టాఫీసు, అండర్ బ్రిడ్జి ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు వర్ణణాతీతంగా మారాయి.

రోడ్లపైనే పార్కింగ్...

మండిబజార్, జేపీఎన్ రోడ్డు, వరంగల్ చౌరస్తా, బట్టల బజార్, పిన్నవారీ వీధి, నిర్మల మాల్, వరంగల్ ఎస్‌బీహెచ్, స్టేషన్‌రోడ్, వరంగల్ బస్ స్టేషన్, రైల్వే స్టేషన్, ఆర్ఎన్‌టీరోడ్, దుర్గేశ్వరాలయ వీధి, బట్టల బజార్‌రోడ్, చార్‌బౌళి రోడ్, కాశిబుగ్గ, బట్టల బజార్ బ్రిడ్జి కింద, మొగిలిచర్ల రోడ్ తదితర ప్రాంతాలలో రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. బట్టల బజార్ బ్రిడ్జి కింద వాహనాలు పార్కింగ్ చేయడంతో రాకపోకలకు ఇబ్బదులు ఎదురవుతున్నాయి. వరంగల్ ఎంజీఎం జంక్షన్‌లో ఒక హోటల్, బార్ షాప్ ముందు వాహనాలు పార్కింగ్ చేస్తుండడం, ఇస్లామీయ కాంప్లెక్స్ ముందు వాహనాలుపార్కింగ్ చేయడం, ఎంజీ రోడ్డులో ఎంజీఎం రోడ్డు వెంబడి అంబులెన్స్‌లు పార్క్‌తో ట్రాఫిక్ తప్పలు తప్పడం ఏదు. కొత్తవాడ జంక్షన్ ఎంజీ రోడ్లలో రెండు బార్‌షాప్‌లు, వైన్ షాపుల ముందు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. పోచమ్మమైదాన్‌లోని జకోటియా కాంప్లెక్స్ ముందు, పోచమ్మమైదాన్‌లోని ఓ హోటల్, బ్యాంకు ఎదుట వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. అలాగే మండిబజార్‌లో ఓ బిర్యానీ సెంటర్, విశ్వకర్మవీధీ, డాల్ఫిన్ గల్లీ, ఆర్ఎన్‌టీ రోడ్డులో రోడ్లు మీదనే వాహనాలను పార్కింగ్ చేయడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. కాశీబుగ్గ, నర్సంపేట రోడ్డులో రెండు బార్‌షాప్‌లు, ఒక వైన్‌షాపు ముందు రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణలో అధికారుల విఫలం..

నగరంలో ట్రాఫిక్‌ను నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. శాస్త్రీయంగా ఎలాంటి పరిశీలన జరగడం లేదనే విమర్శలు వస్తున్నారు. వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్ల విస్తరణ లేకపోవడం, నగరంలో వాహనాల సంఖ్య పెరుగుతున్నా తగిన చర్యలు తీసుకోవడం లేదు. జంక్షన్‌లను అభివృద్ధి చేయడంలో బల్దియా, కుడా శాఖల నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోంది. కనీసం రోడ్లపై ఉన్న అక్రమణలను తొలగించడంలో కార్పొరేషన్‌టౌన్ ప్లానింగ్ విభాగం, ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఫ్లై ఓవర్లు, యూటర్న్‌లు, రోడ్ల విస్తరణ చేయాలని నిపుణులు సూచి స్తున్నా ఆ దిశగా పాలకులు అడుగులు వేయపోవడంతో నగరవాసులు ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు.

గుణపాఠం చెప్పినా కేంద్ర వైఖరి మారలేదు

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ● వరంగల్‌లో సీపీఐ రాజకీయ శిక్షణతరగతులు ప్రారంభం

ఆటోనగర్, జూలై 9: గత ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పినా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. వరంగల్ కొత్తవాడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సీపీఐ వరంగల్ మండల కార్యదర్శి బుస్సా రవీందర్ అధ్యక్షతన మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదట పార్టీ జెండాను రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టారని ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతుకలను అణిచివేసి, అనేక మందిపై అక్రమ కేసులను బనాయించి జైలుకు పంపారని ఆరోపించారు. రైతుల, కార్మికుల వ్యతిరేక చట్టాలు తెచ్చారని, ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టారని, దాదాపు రూ.12లక్షల కోట్లు వారికి రాయితీ ఇచ్చారని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలను కూడా కేంద్రం అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. చావు తప్పి కన్ను లొట్టబోయిన విధంగా బీజేపీకి పూర్తి మెజార్టీ రాలేదని, టీడీపీ, జేడీయూ మద్దతుతో మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. లోక్‌సభకు ఎన్నికైన వారిలో దాదాపు 259 మంది నేర చరిత్ర కలవారున్నారని, కేంద్ర మంత్రి వర్గం కూడా నేరచరిత్ర ఉన్నవారితో నిండిపోయిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గతంలో కన్నా గణనీయమైన సీట్లు సాధించి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచిందని, భవిష్యత్తులో ఇండియా కూటమి కూడా ప్రజల మద్దతు కూడగట్టేందుకు మరింత పట్టుదలగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తొలిరోజు శిక్షణ తరగతులలో మార్క్సిజంపై నేదునూరి రాజమౌళి, రాజ్యాంగంపై డాక్టర్ మార్క శంకర్‌నారాయణ వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు మేకల రవి, కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, ఎన్.అశోక్, స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాషామియా, పనాస ప్రసాద్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి



కొండా దంపతతుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న వ్యాపారులు

బట్టలబజార్ వన్‌వే ఎత్తివేత

మట్టెవాడ, జూలై 9: వరంగల్ చౌరస్తా బట్టల బజార్ రోడ్డు పిన్నవారి వీధి ప్రాంతాల్లో వ్యాపారస్తుల విజ్ఞప్తి మేరకు మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుల సూచన మేరకు వరంగల్ ట్రాఫిక్ పోలీసులు వన్‌వే ఎత్తివేశారు. దీంతో మంగళవారం కొండా దంపతుల చిత్రపటాలకు వరంగల్ బులియన్, డైమండ్ మర్చంట్ అసోసియేషన్ నాయకుడు తోట హరీష్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. తోట హరీష్ మాట్లాడుతూ వరంగల్ స్టేషన్ రోడ్డు నుంచి చౌరస్తా, బట్టలబజారు, పిన్నవారి వీధిలకు కార్లు, ఆటోలు రాకుండా వన్ వే ట్రాఫిక్ బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వ్యాపార లావాదేవీలకు జరగడం లేదంటూ వ్యాపారస్తులు మంత్రి దృష్టికి తేవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పడిశాల నాగరాజు, అధ్యక్షుడు గుండు శ్రీనివాస్, సెక్రటరీ గార్లపాటి శ్రీనివాస్, నార్ల సతీష్, ఆడెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన నాయకులు

ఆటోనగర్, జూలై 9: తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి దన సరి అనసూయ సీతక్క జన్మదినం సందర్భంగా ములుగు జిల్లాలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్‌లు మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌గౌడ్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో బీసీల కులగణన చేపట్టి బీసీల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రిని కోరారు.



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీసీ నాయకులు

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఖానాపురం, జూలై 9:మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా(డీసీసీ) అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మంగళవారం అశోక్‌నగర్ కస్తూర్బా గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి మొక్కలే రేపటి వృక్షాలని, మొక్కలు నాటడంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో మేనక, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఎల్డి శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టి సారంగపాణి, ముస్కు మోహన్, జాడి అచ్యూతమ్, జాడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా నోట్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసవీ విద్యా సేవా సమితి సభ్యులు

వరంగల్ కల్చరల్, జూలై 9: నగరంలోని శ్రీవాసవీ విద్యా సేవా సమితి వారిచే ఏవీవీ పాఠశాలలోని ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు మంగళవారం ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాం భిక్షపతి, గుమ్మడవెల్లి సత్యనారాయణలు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతీ రోజు అరటి పండును అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ఎ.భుజెందర్‌రెడ్డి, చందా శ్రీకాంత్, శ్రీరాం భిక్షపతి, గుమ్మడవెల్లి సత్యనారాయణ, శ్రీరాం సతీష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులను పూర్తిచేయాలి

గీసుగొండ, జూలై 9: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏఏపీసీ)ల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని హెచ్‌ఎంను ఎంఎన్‌వో రవిందర్ కోరారు. మంగళవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతూ పూర్తయిన పనులకు ఏఈతో ఎంబీలు చేయించాలని సూచించారు. పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టిందన్నారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థుల ఎన్ రోల్‌ను పెంచేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో గెటిటెడ్ హెచ్‌ఎంలు పట్టాభి, రజాక్, ముత్యాలు, సంపత్‌రావు, జ్యోతిర్మయి, పీఎస్ హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

బీసీ సాధికారత సంఘం రాష్ట్ర కార్యదర్శికి సన్మానం



ఖిలావరంగల్, జూలై 9: తెలంగాణ వెనకబడిన తరగతుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కొయ్యడ (కరాటే)ప్రభాకర్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సన్మానించారు. బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ శివనగర్‌కు చెందిన ప్రభాకర్ రాష్ట్రంలోని 133 బీసీ కులాల ఐక్యతకు కృషి చేసేందుకు ఆయన పాటుపడుతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య, కౌన్సిల్ చైర్మన్ కొవ్వూరి భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి జల్లిపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ప్రజాసేవకు పదవులు అక్కర్లేదు'

సంగెం, జూలై 9: ప్రజాసేవకు పదవులు అవసరం లేదని గ్రామ ప్రత్యేకాధికారి, సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం కుంటపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీపీగా పదవీ విరమణ పొందిన కందకట్ల కళావతి దంపతులను సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ అందించే ప్రజాప్రతనిధులను ప్రజలు చిరస్థాయిగా గుర్తుంచుకుంటారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కిషన్, మాజీ సర్పంచ్‌లు కావాటి వెంకటయ్య, ఎలిగోయి లింగయ్య, నరహరి, కాగితాల జగన్నాథచారి, బూసాని మొగిలి, చిర్ర మొగిలి,జునప్ప దేవేందర్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు పునరుద్ధరణకు సహకరించాలి : ఎమ్మెల్యే

సంగెం, జూలై 9: విమానాశ్రయ పునరుద్ధరణకు సహకరించాలని, భూములను కోల్పోతున్న రైతులను ప్రభుత్వం తగిన విధంగా ఆదుకుంటుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చెప్పారు. మంగళవారం గుంటూరుపల్లిలో రైతులతో అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మామునూరు విమానాశ్రయ రన్‌వేను మరింత పొడిగించాలని నిపుణుల సిఫారుసుల మేరకు మరికొంత భూమిని సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయిం చిందన్నారు. భూ పరిహారం చెల్లించే విషయంలో ప్రభుత్వం ప్రకటించిన ధరలు తక్కువగా ఉన్న విషయంపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. గాడేపల్లిలో విమానాశ్రయ భూముల విస్తరణలో 12ఇళ్లను కోల్పోతున్న విషయంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. వరంగల్ నగరానికి వెళ్లేందుకు దగ్గరి దారిని ఏర్పాటు చేసేలా అధికారులతో చర్చించి నిర్ణయానికి రానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చోల్లేటి మాధవరెడ్డి, నాయకులు గుమ్మడి హరిబాబు, కందకట్ల నరహరి, జనగాం రమేష్, అంజన్‌రావు, మెట్టుపల్లి రమేష్,శ్రీకాంత్, దండ నరేష్ పాల్గొన్నారు.



గుంటూరుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి





నాగేంద్రుడికి ఆషాఢమాస పూజలు

గీసుగొండ, జూలై 9: ఊకల్‌లోని నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆషాడమాస శుక్లపక్షం శాకాంబరీ పూజలు మంగళవారం నిర్వహించారు. సర్పసూక్త విధానంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సముద్రాల శ్రీనివాసాచార్యులు, శ్రీహర్షాచార్యులు, ఆలయ కమిటీ ఛైర్మన్ మాచినపెల్లి బాబురావు, కొత్తగట్టు రాజేందర్, శ్రీరాములు రమేష్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు పునరుద్ధరణకు సహకరించాలి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి

సంగెం, జూలై 9: విమానాశ్రయ పునరుద్ధరణకు సహకరించాలని, భూములను కోల్పోతున్న రైతులను ప్రభుత్వం తగిన విధంగా ఆదుకుంటుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి చెప్పారు. మంగళవారం గుంటూరుపల్లిలో రైతులతో అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మామునూరు విమానాశ్రయ రన్‌వేను మరింత పొడిగించాలని నిపుణుల సిఫారసుల మేరకు మరికొంత భూమిని సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. భూ పరిహారం చెల్లించే విషయంలో ప్రభుత్వం ప్రకటించిన ధరలు తక్కువగా ఉన్న విషయంపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. గాడేపల్లిలో విమానాశ్రయ భూముల విస్తరణ లో 12 ఇళ్లను కోల్పోతున్న విషయంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. వరంగల్ నగరానికి వెళ్లేందుకు దగ్గరి దారిని ఏర్పాటు చేసేలా అధికారులతో చర్చించి నిర్ణయానికి రానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చోల్లేటి మాధవరెడ్డి, నాయకులు గుమ్మడి హరిబాబు, కందకట్ల నరహరి, జనగాం రమేష్, అంజన్‌రావు, మెట్టుపల్లి రమేష్,శ్రీకాంత్, దండ నరేష్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

నర్సంపేట, జూలై 9 : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం సదానందం డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో కత్తుల కొమురయ్య అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు, 120 గజాల ఇంటి స్థలం కేటాయించి ఇంటి నిర్మాణాల కోసం రూ. 10 లక్షలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పాత రుణాలను రద్దు చేసి కొత్తరుణాలు అందించాలని, పెరిగిన ధరలకు అణుగుణంగా పింఛన్లను పెంచాలని, పంటల భీమాపథకాన్ని ఆగస్టువరకు అమలు చేయాలని, కౌలు రైతులకుగుర్తింపు కార్డులను అందించాలన్నారు. కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లాకార్యదర్శి చిర్రసూరి, డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు, పాణి, మధుసూధన్‌రెడ్డి, లింగన్న పాల్గొన్నారు.

యశస్వినిరెడ్డితోనే నియోజకవర్గ అభివృద్ధి

రాయపర్తి, జూలై 9 : పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డితోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్‌అండ్‌ఆర్(మొరిపిరాల) కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రామంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలను కలిసి గ్రామ సమస్యలు తెలుసుకుంటున్నట్లు తెలిపారు. స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలు చూపనున్నట్లు స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు రాజిరెడ్డి, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, చిర్ర మల్లయ్య, చినపాక ఎల్లయ్య, సుదన్శన్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బోర్డుపై ఓ పేరు.. రికార్డులో మరో పేరు

- వర్ధన్నపేటలో ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం మాయాజాలం
- ఫీజులు, యాప్‌లు, పరీక్షల పేరిట మోసం చేస్తున్నవైనం
- ఆరేళ్లుగా పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- జిల్లా అధికారులకు పలువురి ఫిర్యాదుతో కదలిక

వర్ధన్నపేట, జూలై 9: రోజు రోజుకు కొన్ని ప్రైవేటు స్కూళ్ల దోపిడీ ఎక్కువైపోతోంది. బోర్డుపై ఓ పేరుతో.. రికార్డుల్లో మరో పేరుతో అటు ప్రభుత్వాన్ని.. ఇటు విద్యార్థులు, తల్లిదండ్రులను మోసగిస్తూ డబ్బులు దండుకోవడం ఆ యాజయాన్యాలకు పరిపాటిగా మారింది. అందుకు వర్ధన్నపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం వ్యవహరించిన తీరే నిదర్శనంగా నిలిచింది. సదరు పాఠశాల పేరు బోర్డుపై ఒకటి ఉండగా.. రికార్డుల్లో మరో పేరు ఉంది. గతేడాది ఈ వ్యవహారంపై దుమారం లేవగా.. యాజమాన్యం అధికారులను ప్రసన్నం చేసుకుని.. కొన్ని రోజుల్లో అనుమతులు తీసుకుంటామని మాయమాటలు చెప్పింది. చివరకు యాజమాన్యం మారింది.. పాఠశాల మారింది అంటూ ఐఐటీ, ఈ టెక్నోల పేరిట మోసం చేస్తూ ఫీజులను భారీగా పెంచేశారు. మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులు, వారి తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకుని రూ.లక్షల్లో ఫీజులు దండుకుంటున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. వర్ధన్నపేట ప్రధాన రహదారిలో ఉన్న ఈ పాఠశాల యాజమాన్యం బోర్డుపై ఒక పేరును పెట్టి.. రికార్డుల్లో మాత్రం ఓ కార్పొరేట్ విద్యాసంస్థ పేరుతో నడుపుతోంది. విద్యార్థులకు అందించే ఐడీ కార్డులు, పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బస్సుల వెహికిల్ లాగ్ బుక్కుల్లోనూ అదే కార్పొరేట్ విద్యాసంస్థ పేరునే పెట్టి మోసం చేస్తున్నారు. ఇక స్కూల్ బస్సులపై ఎలాంటి పేరు లేకుండానే విద్యార్థులను తరలించడం గమనార్హం. ఇదే విషయమై గతంలో కొన్ని గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో యాజమాన్యం.. పూర్వపు యాజమాన్యాన్ని పిలిపించి వివాదానికి తాత్కాలికంగా చెక్‌పెట్టారు. ఇవన్నీ తెలిసినా సమాచారం ఇచ్చినా ఆరేళ్లుగా పట్టించుకోలేదని మండల విద్యాశాఖ అధికారులు.. మంగళవారం జిల్లా అధికారులకు కొందరు చేసిన ఫిర్యాదుతో హడావుడిగా పాఠశాలను సందర్శించి, రికార్డులను పరిశీలించడం చర్చనీయాంశమైంది.

పోటీ పరీక్షల పేరిట వసూళ్లు

సదరు పాఠశాల యాజమాన్యం.. కార్పొరేట్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఒలింపియాడ్ పరీక్షల నిర్వహిస్తున్నామంటూ సరికొత్త మోసానికి తెరతీసింది. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే ఉచితంగా విద్యాబోధన అందిస్తామని ఒక్కో విద్యార్థి నుంచి రూ. 150 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నారు. ఇవే కాకుండా ఐఎన్‌టీఎస్‌వో, ఇతర ఎగ్జామ్స్ అంటూ డబ్బులు వసూలు చేసి అందులో కొందరిని ఎంపిక చేసి కొన్ని నెలల తర్వాత వారికి చిన్న బహుమతులను అందించి చేతులు దులుపుకొంటున్నారు. వీటన్నిటిని తల్లిదండ్రులు నమ్మేలా ఓ వెబ్‌సైట్ లింక్ ఇచ్చి పరీక్షలు రాయిస్తున్నారు. ఇలా జనానికి అర్థం కాని పరీక్షల పేర్లు చెప్పి తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇదిలా ఉంటే ఈ పరీక్షలకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని తమ సంస్థలో పనిచేసే ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం మరో కోణం. వారికి లక్ష్యాలను విధించడం.. లక్ష్యాన్ని చేరుకోకపోతే వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే టీచర్ల మెడపై అడ్మిషన్ల కత్తి పెడుతోంది. వేసవి కాలంలో కూడా సెలవులు ఇవ్వకుండా అడ్మిషన్ల కోసం తిప్పుతోందన్న విమర్శలున్నాయి. చాలీచాలని జీతాలు ఇచ్చి వారితో వెట్టి చాకిరీ చేయిస్తున్నారన్న విమర్శలున్నాయి.



కార్పొరేట్ పాఠశాల పేరుతో ఉన్న బోర్డును తొలగింపజేస్తున్న అధికారులు

భారీగా ఫీజులు, అనవసర పుస్తకాలు..

కార్పొరేట్ స్కూల్ పేరిట మోసం చేయడమే కాకుండా ఫీజులు కూడా యాజమాన్యం భారీగా వసూలు చేస్తోంది. ఒకటో తేదీ విద్యార్థికి దాదాపు రూ.30వేల వరకు ఫీజు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. దీనికి తోడు వారి పాఠశాల ముద్రతో ఉన్న పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు కొనాలని హుకుం జారీ చేసి వాటికి అదనంగా రూ. 4వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేయడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఫీజు పదోతరగతి విద్యార్థికి వచ్చే సరికి రూ.50వేల నుంచి రూ.60వేలకు చేరుతోంది. అయితే వీరు అంటగడుతున్న పుస్తకాల్లో అనవసరమైనే ఎక్కువగా ఉన్నాయన్న ఆరోపణలున్నాయి.

పలువురి ఫిర్యాదుతో కదిలిన విద్యాశాఖ

- కార్పొరేట్ సంస్థ పేరుతో ఉన్న బోర్డు తొలగింపు
- రికార్డులను పరిశీలించిన ఇన్‌చార్జ్ ఎంఈవో

వర్ధన్నపేట పట్టణంలో ఆరేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు ఇంత కాలం పట్టించుకోలేదని ఆరోపణలున్నాయి. యాజమాన్యం స్థానికంగా ఉండకపోగా.. ఈ పాఠశాలకు సంబంధించి ఏడాదికో ప్రిన్సిపాల్‌ను నియమిస్తున్నారు. ఈ క్రమంలో ఎప్పుడైనా ప్రిన్సిపాల్‌తో మాట్లాడితే తమకుపై నుంచి ఆదేశాలు రావాలని, ఏజీఎం, జీఎం చెప్పాలి అంటూ మాట దాటవేస్తారు. విద్యార్థులను చేర్చుకునే వరకు ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఉపాధ్యాయులు, ఏదైనా సమస్య వచ్చినపుడు ప్రశ్నిస్తే తనకు పైనుంచి ఆదేశాలు రావాలని, తామేమీ చేయలేమంటూ చేతులు దులుపుకొంటారు. అయితే ఈ పాఠశాల తీరు పట్ల మంగళవారం పలువురు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇన్‌చార్జ్ ఎంఈవోగా ఉన్న నోముల రంగయ్య పాఠశాలను సందర్శించి.. బోర్డుపై శ్రీ అరబిందో హైస్కూల్ అని, పాఠశాల లోపల రికార్డులను మాత్రం శ్రీ చైతన్య స్కూల్ పేరుతో నిర్వహిస్తున్నారని గుర్తించారు. దాంతో ఆ బోర్డును, శ్రీచైతన్య కరక్యులమ్ పేరిట పెట్టిన బోర్డును తీసివేయించారు.

పలు రికార్డులను పరిశీలించి ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ నుంచి వివరాలు సేకరించారు. పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా బోర్డు ఏర్పాటు చేయడం, పుస్తకాలు అమ్మడం, బస్సులపై స్కూల్ పేరు లేకపోవడంతో పాటు పలు విషయాలు ఎంఈవో దృష్టికి రావడంతో ఆయన యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇదిలా ఉంటే ఇన్నాళ్లుగా ఈ పాఠశాల ఇలాగే నడుస్తున్నా, ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసిన ఎంఈవో రాలేదని, చివరకు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాక రావడం దురదృష్టకరమని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కార్పొరేట్ సంస్థల చేతుల్లో విద్యాశాఖ అధికారులు కీలు బొమ్మలుగా మారడం సరికాదని, ఇలాంటి శ్రీ చైతన్య విద్యాసంస్థలు ఎన్నో చోట్ల ఉన్నాయని, అవన్నీ నిబంధనల ప్రకారం నడుస్తున్నాయో లేదో విద్యా శాఖ అధికారులకే తెలియాలని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

- డీఆర్‌డీవో కౌసల్యదేవి
- ఉపాధిహామీ సిబ్బందిపై ఆగ్రహం



ప్రజావేదిక సభలో సిబ్బందిపై అగ్రహం వ్యక్తం చేస్తున్న కౌసల్యదేవి

చెన్నారావుపేట, జూలై 9: ఉపాధిహామీ పనులల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పావని డీఆర్‌డీవో కౌసల్యదేవి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజా వేదిక మండల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలల్లో తనిఖీ బృందం చేపట్టిన విషయాలను సభలో వివరించారు. గ్రామాల్లో కొంత మంది కూలీలకు సంబంధించిన బిల్లులు చెల్లించటం లేదని, ప్లేస్లిప్‌లు అందించటం లేదని, జాబ్ కార్డులు అందిచటంలేదని, కూలీలు పని చేసిన ఎంబీ రికార్డులల్లో కూలీలను సంతకాలు సరిగా ఉండటం లేదని, అలాగే రైతులు సంతకాలను తీసుకోవటం లేదని తెలిపారు. పని చేసే ప్రదేశాలల్లో బోర్డులను ఏర్పాటు చేయటం లేదని తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. కోనాపురంలో ఇంకుడు గుంతల బిల్లులు చెల్లించలేదని, సంవత్సరాల కాలంగా ఇంకుడు గుంతల బిల్లులు పెండింగ్‌లోఉన్నాయని సభలో తనిఖీ బృందం తెలిపింది. అంతేకాకుండా పని వివరాలను గ్రామ పంచాయతీల్లో బోర్డులు ఏర్పాటు చేయటం లేదని తెలిపారు. రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలకు రక్షణ లేదని, రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కల రక్షణకు చర్యలు తీసుకోవాలని బృందం వివరించింది. అంతేకాకుండా ఏపీవో గ్రామాలల్లో పనులు జరుగుతున్న ప్రదేశాలను పరిశీలించటం లేదని వివరించారు.

ఈ సందర్భంగా డీఆర్‌డీవో కౌసల్యదేవి మాట్లాడుతూ పనులు చేయటం చేత కాకుండా ఇంటి వద్దనే ఉండాలని, ఏపీవో అరుణ, కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ల పని తీరు బాగా లేదని అగ్రహం వ్యక్తం చేశారు. పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఏడు రకాల రిజిష్టర్లు తప్పకుండా మెంటెన్ చేయాలన్నారు. రికార్డులు సరిగా లేకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గడ్డం దయాకర్ విజిలెన్స్ హెచ్‌ఆర్ మాధవి, సోషల్ అడిట్ టీమ్ మెంబర్ సాయి జ్ఞానేందర్, హెచ్‌ఆర్‌డీ కొంరయ్య, జూనియర్ క్వాలిటీ కంట్రోలర్ ఆఫీసర్ హరీషా, ఎంపీవో శ్రీధర్‌రాజు. ఏపీవో అరుణ, ఈసీ కిషోర్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

డీసీసీ అధికార ప్రతినిధి రవీందర్‌రావు

ఖానాపురం, జులై 9: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా(డీసీసీ) అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మంగళవారం అశోక్‌నగర్ కస్తూర్బా గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి మొక్కలే రేపటి వృక్షాలని, మొక్కలు నాటడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో మేనక, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎల్డి శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టి సారంగపాణి, ముస్కు మోహన్, జాడి అచ్యూతమ్, జాడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ పాలకమండలి సభ్యుడికి సన్మానం



ప్రిన్సిపాల్ నవీన్‌ను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

నర్సంపేట టౌన్, జూలై 9 : కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యుడిగా ఎంపికైన నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్‌ను కళాశాల అధ్యాపకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భం గా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పనితీరు మరింత మెరుగుపరచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సమస్యలను యూనివర్సిటీ దృష్టికి తీసుకెళ్తానని, వాటి పరిష్కారానికి పాటుపడుతానన్నారు. తాను నర్సంపేట కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం కళాశాలకు అటానమస్ హోదా కోసం అవిశ్రాంతంగా పనిచేశానన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. శ్రీనాథ్, డాక్టర్ శివనాగ శ్రీను, నరేందర్, సత్యనారాయణ, విష్ణుకుమార్, ప్రసూన, సమ్మయ్య పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో ఉపాధి పనులను ప్రారంభించాలి

వర్ధన్నపేట, జూలై 9: మునిసిపాలిటీల్లో ఉపాధి లేక పనులు లభించక ప్రజలు, కూలీలు తీవ్రఇబ్బందులు పడుతున్నారని వెంటనే ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని పునఃప్రారంభించేలా ప్రజా ప్రతినిధులు, అధికారులలు తగు చర్యలు తీసుకోవాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్‌ఎ్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. వర్ధన్నపేట, డీసీ తండాలను మునిసిపాలిటీగా ఏర్పాటు చేసిన ప్రజా ప్రతినిధులు పరిశ్రమలు ఏర్పాటు చేయకపోగా ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. అంతేకాకుండా కూలీలకు సొంత గ్రామంలో పనులు కల్పించే ఉపాధిహామీ దళిత గిరిజనులు, బీసీలకు దూరమైందన్నారు. ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా ఉపాధిహామీని మునిసిపాలిటీలో కొనసాగించేలా కృషి చేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు సంఘ సభ్యులైన కంజర్ల సమ్మయ్య, గబ్బెట బాబులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

విద్యతోనే బంగారు భవిష్యత్



విద్యార్థులకు వస్తువులు అందజేస్తున్న కౌన్సిలర్ రాయిడి కీర్తిరెడ్డి

నర్సంపేట, జూలై 9: విద్యతోనే బంగారు భవిష్యత్‌ను పొందవచ్చని 9వ వార్డు కౌన్సిలర్ రాయిడి కీర్తిరెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని సంజయ్‌గాంధీనగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, కలర్ పెన్సిళ్లు, జామెట్రిబాక్సులు, స్కేల్లు ఆమె మంగళవారం అందించారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ బాలబాలికలు చక్కగా చదువుకొని విద్యావంతులుగా, ఉత్తమపౌరులుగా ఎదగాలన్నారు. గతంలోనూ విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, కుర్చీలు అందించామని, అవసరమయిన వాటిని అందించడానికి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమం అనంతరం పాఠశాల హెచ్‌ఎం కేశవరెడ్డిని సన్మానించారు. కా ర్యక్రమంలో గొడిశాల గిరినాథ్, వలుస సత్యనారాయణ, మొద్దువేణు, యుగేందర్, గొడిశాల అనిల్, రమేశ్, కొలువుల ప్రవీణ్, జహీరాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

నర్సంపేట టౌన్, జూలై 9 : అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఏబీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏబీవీపీ జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు వేల్పుల రాజ్‌కుమార్, జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్, పొన్నాల శశికుమార్, దీపక్, అఖిల్, హేమంత్, సూర్యతేజ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త దిలీప్‌కుమార్

దుగ్గొండి, జూలై 9: రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని డాక్టర్,శాస్త్రవేత్త దిలీప్‌కుమార్ అన్నారు. మంగళవారం నల్లబెల్లి మండలం అర్వయ్యపల్లెలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో రైతులు వరి నాటుకు ముందు యాజమాన్య పద్ధతిని పాటించాలని, వరిలో ఎరువులను తగిన మోతాదులో వాడుకోవాలన్నారు. పత్తిలోను చీడ పీడల నివారణ కోసం రైతులు తమ సూచనలు పాటిస్తే అధికంగా దిగుబడి పొందవచ్చునన్నారు. అనంతరం వ్యవసాయ పరిశోధన కేంద్రం వారు 40 మంది రైతులకు ఉచితంగా మందును పిచికారి చేసే చేతి పంపులను అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రాములు, డాక్టర్ శ్రవన్‌కుమార్, డాక్టర్ మధు. మాజీ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సీత్లా భవాని పండుగ

నర్సంపేట టౌన్, జూలై 9 : నర్సంపేట మండలంలోని పలు తండాల్లో గిరిజనులు మంగళవారం సీత్లా భవాని పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ సంవత్సరం ఆషాడమాసంలో ఈ పండుగను గిరిజనులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఇందులో భాగంగా మండలంలోని బోజ్యనాయక్‌తండలో గ్రామ పొలిమేరలో తమ ఆరాధ్య దేవతలను ఏడుగురిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. డప్పుచప్పుళ్లతో యువతులు, మహిళలు, చిన్నారులు నృత్యాలు చేసుకుంటూ దేవత విగ్రహాల వద్దకు సమూహంగా వెళ్లి నేవైద్యాలను సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూజారి భూక్య బావ్‌సింగ్, అజ్మీర నారాయణ, వీరన్న, బీజేపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు భట్టు మదన్ తదితరులు పాల్గొన్నారు. రాములునాయక్‌తండా, నర్సంపేట పట్టణంలోని వల్లబ్‌నగర్‌లో గిరిజనులు పండుగన భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కార్యక్రమంలో అంగోతు వెంకన్న, వీరన్న, శివరాం, సమ్ములు, వీరన్న, బాలు, శివకుమార్ పాల్గొన్నారు.

● ఖానాపురం: మండల వ్యాప్తంగా పలు తండాల్లోని గిరిజనులు సీత్లా పండుగను వైభవంగా నిర్వహించారు. అశోక్‌నగర్ శివారు గోల్యానాయక్‌తండా, మంగళవారిపేట, నాజీతండా, గొల్లగూడెం, భద్రుతండా, కొడ్తిమాట్‌తండా, కొత్తూరు, వేపచెట్టుతండా, బండమీదిమామిడితండా, చిలుకమ్మతండా, బోడియాతండాలో డప్పువాయిద్యాలతో నృత్యాలు చేస్తూ, బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సంవృద్ధిగా పడి పాడి, పంటలు వృద్ధి చెందాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో గోల్యనాయక్‌తండాలో రవి, ధరావత్ వెంకన్న, ధరావత్ రమేష్, రాజు, శ్రీనివాస్, రవివర్మ, భానోతు రాజు తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: మండలంలోని పాపయ్యపేట, సూర్యపేటతండా, కాల్‌నాయక్‌తండా, గొల్లబామతండా, జల్లి తండాలతో పాటు పలు తండాలల్లో సీత్లా పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ పాడి పంటలు బాగుండాలని, వర్ష కాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా ఉండాలని సీత్లా భవానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా తండాల గిరిజనులు పాల్గొన్నారు.

● పర్వతగిరి: గిరిజనుల ఆరాధ్యదైవమైన సీత్లాభవాని పండుగ వేడుకలను మండలంలోని ఆయా తండాల్లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గిరిజన మహిళలు బోనాలతో తరలివెళ్లి సీత్లాభవాని గద్దెల వద్ద సమర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ లూనావత్ కమలపంతులు, భిక్షానాయక్, గణేష్, రూప్లా నాయక్ పాల్గొన్నారు.

● రాయపర్తి: మండలంలోని వాంకుడోతుతండా, కునుసోతు తండా, భూక్యా తండా, ధరావత్ తండా, లకావత్ తండాల్లో మంగళవారం ఘనంగా సీత్లా వేడుకలు నిర్వహించారు. ప్రకృతిని ఆరాధ్య దైవంగా భావించే గిరిజనులు జరుపుకునే ఈ పండుగ ఎంతో అంగరంగ వైభవంగా జరిగింది. పశు సంపద బాగుండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడి పంటలు చల్లంగా ఉండాలని మొక్కులు చెల్లించారు.



ఖానాపురంలోని గోల్యనాయక్ తండాలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

● దుగ్గొండి: మండలంలోని రాజ్యాతండాలో ఆషాడమాసం మంగళవారంను పురస్కరించుకొని సీత్లా భవాని పండుగ వేడుకలనుతండా వాసులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు సీత్లా భవానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవిందర్ కుల పెద్దలు, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట: ప్రకృతిని పూజించే సీత్లా పండుగను వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని భవానికుంట, తదితర తండాల్లో మంగళవారం బంజారాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బంజారా మహిళలు భాజా భజంత్రీల మధ్య బోనాలను నెత్తిన ఎత్తుకొని అమ్మవారి ఆలయానికి తరలి వచ్చి పాడిపంటలు, అష్టైశ్వర్యాలు తులతూగే విధంగా దీవించమని దేవదేవి సీత్లా దేవిని బంజారాలు వేడుకున్నారు.